క్లుప్తంగా

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అప్పారావు

సారవకోట: మండలంలోని పెద్దలంబ పోలింగ్ కేంద్రాన్ని ఎస్ఐ అప్పారావు బుధవారం పరిశీలించారు. విద్యుత్ సరఫరా, తాగునీరు, ర్యాంప్ తదితర అంశాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో అన్ని మౌలిక వసతులున్నట్లు గుర్తించారు. పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ, సిబ్బంది ఉన్నారు.

సీఎం జగన్ పేరిట ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి కావాలని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆలయ చరిత్ర, గోలెం విశేషాలు, స్థలపురాణం వివరించారు. స్వామి, వారాహి అమ్మవారి శేష వస్త్రాలు అందించి పుణ్యాహ వచనాలతో దీవించారు. తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ చైర్మన్ రమణ, ఎంపీటీసీ కె.హరిప్రసాద్ ఉన్నారు.

వృద్ధాశ్రమానికి రూ.50 వేల వితరణ



నగదు అందజేస్తున్న తామాడ సరస్వతి

హిరమండలం: స్థానిక ప్రేమసాయి వృద్ధాశ్రమానికి ఆశ్రమవాసి తామాడ సరస్వతి రూ.50 వేలు అందించారు. ఆశ్రమ కోఆర్డినేటర్ సాయిబాబాకు ఈ మొత్తాన్ని బుధవారం అందజేశారు. గత మూడేళ్లుగా సరస్వతి ఈ ఆశ్రమంలో ఉన్నారు. ఆశ్రమ ప్రాంగణంలో ఆంజనేయ ఆలయానికి సంబంధించి గోపురం నిర్మాణానికి ఈ మొత్తాన్ని వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. ఆశ్రమ కమిటీ సభ్యులు బి.సురేష్, జోషుల గోవిందశర్మ, మేనేజర్ జయరాం ,ఆశ్రమ వాసులు నరసింహమూర్తి, చంద్రభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

సరుబుజ్జిలి: అగ్నిప్రమాదాలు జరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు తెలిపారు. బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్నిప్రమాదాలు జరిగే సమయంలో ఫోమ్, డ్రైకెమికల్ పౌడర్, కార్బన్‌డైఆక్సైడ్ యంత్రం ఉపయోగించే విధానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం లక్ష్మీనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కళా బృందాలకు కోడ్‌ను మినహాయించాలి

సరుబుజ్జిలి: కళారూపాల ప్రదర్శనలకు ఎన్నికల కోడ్‌ను మినహాయించాలని అఖిల ప్రజాకళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బొంగు భాస్కరరావు కోరారు. మండల కేంద్రంలో బుధవారం మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వల్ల కళా ప్రదర్శనలు నిలిపేశారని, దీనిపై ఆధారపడి జీవిస్తున్న వందలాది కుటుంబాలు ఉపాధికోల్పోయే ప్రమాదముందని స్పష్టం చేశారు. వేసవిలో అమ్మవారి పండుగలు, జాతరలు, వివాహాలు జరుగుతున్నందున ఎన్నికల నిబంధనల నుంచి మినహాయించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలకు అంతరాయం

ఎల్.ఎన్.పేట: మండలంలోని రావిచెంద్రి వద్ద ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో గురువారం మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఈఈ జి.శంకరరావు బుధవారం తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పింఛన్ పాట్లు



హిరమండలం: సచివాయం-2లో పింఛన్ కోసం లైన్‌లో ఉన్న లబ్ధిదారులు

ప్రతినెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే వలంటీర్ వచ్చి.. తలుపుతట్టి చేతికి అందించిన పింఛన్ కోసం ఈ నెలలో లబ్ధిదారులు నిరీక్షించాల్సి వచ్చింది. టీడీపీ నాయకుల తీరుతో ఈసారి సచివాలయాలకు వెళ్లి పింఛన్లు తీసుకోవాలని ఎలక్షన్ కమిషన్ ఆదేశించింది. దీంతో మండుటెండలో అష్టకష్టాలుపడుతూ వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు బుధవారం సచివాలయబాట పట్టారు. అక్కడ పింఛన్ డబ్బుల కోసం నిరీక్షించాల్సి వచ్చింది. ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి పింఛన్ మొత్తాన్ని చేతికి అందించే సేవలను అందించేవారు. చంద్రబాబు నిర్వాకంతోనే ఈ కష్టాలు వచ్చాయన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మెళియాపుట్టి: చాపర సచివాలయం వద్ద చీకటి పడినా లైన్లో వేచివున్న పింఛన్‌దారులు



మెళియాపుట్టి: మండుటెండలో పింఛన్ తీసుకోవడానికి వెళ్తున్న వృద్ధులు

దుర్మార్గమైన చర్య



ప్రభుత్వం నాకు వృద్ధాప్య పింఛన్ ఇస్తోంది. ప్రతి నెలా ఒకటో తేది ఉదయాన్నే గ్రామ వలంటీర్ మా ఇంటికే వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. ఈ నెల పింఛన్ ఇవ్వకపోవడంతో బుధవారం వాకబు చేస్తే వలంటీర్లు పింఛన్ ఇవ్వడంలేదని సచివాలయాల్లో ఇస్తారని చెప్పారు. లబ్ధిదారులకు ఇంటివద్దకే పింఛన్ నగదు ఇవ్వడాన్ని చంద్రబాబు అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. చంద్రబాబు తాను ఇవ్వడు, ఇచ్చేవాళ్లను ఇవ్వనివ్వడు.

– బొమ్మాల భీమరాజు, వృద్ధుడు, సుభలయ ఆర్అండ్ఆర్ కాలనీ, హిరమండలం

ఇకపై మాకు ఇబ్బందులే..



ప్రభుత్వం నాకు దివ్యాంగ పింఛన్ ఇస్తోంది. ఇప్పటివరకు వలంటీర్ ఇంటివద్దకే వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. ఇప్పుడు సచివాలయానికి వెళ్లి క్యూలో నిల్చుని పింఛన్ తీసుకోవాలంటే కష్టమే. నాలాంటి వారికి ఎందుకు ఇబ్బందులు పెడుతున్నారో అర్థం కావడంలేదు.

– కొట్నాల భవానీశంకర్, దివ్యాంగుడు, హిరమండలం

వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న కృష్ణచైతన్య

జలుమూరు: మండలంలోని అంధవరంలో టీడీపీకి ఎదురుదెబ్బ తగిలింది. ఈ గ్రామానికి చెందిన 20 టీడీపీ కుటుంబాలవారు వైఎస్సార్‌సీపీ నాయకుడు రేగాన శ్యామ్, ఎంపీటీసీ ఆదిబాబు, ఎస్.గోవిందరావు ఆధ్వర్యంలో బుధవారం చేరారు. వీరికి పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కోటిపల్లి చిన్నారావు, పీత అయ్యప్ప, మొగిలి రాముడు, చిన్నారావు, ఎస్.మల్లేశ్వరరావు, బాబూరావు, అగ్గిరాముడు, లక్ష్మణరావు తదితరులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారిలో ఉన్నారు. ధర్మాన రామలింగం నాయుడు, ఎంపీపీ వాన గోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, అల్లాడ, చల్లవానిపేట పీఏసీఎస్ అధ్యక్షులు ఎం.శ్యామలరావు, ఎం.రాజప్పలనాయుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వి.రమణి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా



నరసన్నపేట: రాజీనామా పత్రాలను ఎంపీడీఓకు అందజేస్తున్న వలంటీర్లు

నరసన్నపేట: మేజరు పంచాయతీలోని సచివాలయం-3 పరిధి హడ్కో కాలనీకి చెందిన ఆరుగురు వలంటీర్లు బుధవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ రామకృష్ణకు అందించారు. రాజీనామా చేసిన వారిలో నడిగోళ భార్గవ్, కొత్త అజిత్, బొమ్మాళి ఉదయ్, మెట్ట యమున, అప్పలం సతీష్, గురివిల్లి ఢిల్లేశ్వరరావు ఉన్నారు.

పెద్దదూగాం వలంటీర్..

జలుమూరు: పెద్దదూగాం పంచాయతీకి చెందిన వలంటీర్ ధర్మాన లక్ష్మీనారాయణ బుధవారం తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. కార్యదర్శి రావాడ వేణుబాబుకు రాజీనామా పత్రాన్ని అందించారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



ఎన్నికల నిబంధనలు వివరిస్తున్న సీఐ వేణుగోపాలరావు

కొత్తూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని స్థానిక సీఐ ఆర్.వేణుగోపాలరావు తెలిపారు. మండలంలోని ఆకులతంపరలో ప్రజలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఎన్నికల కోడ్ పాటించాలన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రతి ఓటరూ బాధ్యత వహించాలన్నారు. మద్యం, నగదు అక్రమంగా తరలిస్తే కేసు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. ఎస్ఐ ఎం.ఎ.అహమ్మద్ పాల్గొన్నారు.

కూటమి కుట్రతోనే పింఛన్ల పంపిణీలో జాప్యం



పెనుమజ్జి విష్ణుమూర్తి

ఎల్.ఎన్.పేట: టీడీపీ, జనసేన పార్టీల అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కల్యాణ్ నిర్వాకం ఫలితంగా అవ్వాతాతలకు ఇచ్చే పింఛన్ల పంపిణీలో జాప్యం చోటు చేసుకుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రతినెలా ఒకటో తేదీ ఉదయం ఆరు గంటలకే పింఛన్ల పంపిణీ ప్రక్రియను గ్రామ వలంటీర్లు పూర్తి చేసేవారని గుర్తు చేశారు. వలంటీర్లపై కక్ష కట్టిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు పదవీ విరమణ చేసిన ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ ప్రసాద్‌తో కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేయించారన్నారు. అవ్వాతాతలతోపాటు దివ్యాంగులు ఇతర వర్గాలకు చెందిన వారు మూడు రోజులుగా పింఛన్ డబ్బుల కోసం ఎదరు చూస్తున్నారన్నారు. ఇంటి వద్దకు వచ్చే పింఛన్ డబ్బులు కోసం ఎండల్లో గ్రామ సచివాలయాల వద్దకు వెళ్లి బుధవారం రోజంతా నిరీక్షించారన్నారు. ఇంటి నుంచి బయటకు రాలేని వారంతా అనేక ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

రెండు పూటలా ఉపాధి పనులు



మాట్లాడుతున్న ఏపీడీ శైలజ

మెళియాపుట్టి: వేసవి తీవ్రత పెరిగిన నేపథ్యంలో ఉపాధి హామీ పనులు ఉదయం, సాయంత్రం వేళల్లో చేయాలని టెక్కలి ఏపీడీ శైలజ, ఎంపీడీఓ భాస్కరరావు అన్నారు. మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో బుధవారం సమీక్షించారు. క్షేత్రస్థాయిలో ఉపాధి వేతనదారులకు పనులు కల్పించేటప్పుడు తప్పనిసరిగా నీడ కల్పించేలా ప్రణాళిక వేసుకోవాలని, వైద్యారోగ్యశాఖ వారి సహకారంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులను అందుబాటులో ఉంచాలన్నారు. వేతనదారులకు నిర్దిష్ట వేతనం లభించేలా కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. 24–25 ఆర్థిక సంవత్సరంలో మొక్కలు నాటడానికి అంచనాలు తయారు చేయాలన్నారు. ప్రతీ గ్రామంలో ఉపాధి పనులు చేపట్టాలన్నారు. ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణ పాల్గొన్నారు.

పాలిసెట్‌పై విద్యార్థులకు అవగాహన

నరసన్నపేట: విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ చూపితే పాలిసెట్‌లో ర్యాంకులు సాధించడం సులువేనని ఆమదాలవలస పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నెపు గోపి అన్నారు. స్థానిక స్వామిబాబు వజ్రమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు పాలిసెట్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏ విధంగా చదవాలనేది వివరించారు. కళాశాలకు చెందిన ఇతర అధ్యాపకులు శ్రీనివాస్, రవీంద్రనాథ్, పి.కృష్ణ తదితరులు మాట్లాడుతూ పాలిటెక్నిక్ కోర్సుల గురించి వివరించారు. పాలిటెక్నిక్ తరువాత విద్య, ఉద్యోగ అవకాశాలు వివరించారు. స్థానిక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రమేష్, రామారావు, కరుణశ్రీ, దివ్య, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ వేణుగోపాలరావు

హిరమండలం: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని కొత్తూరు సీఐ వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని గులుమూరు గ్రామస్తులతో బుధవారం సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. గొడవల జోలికి వెళ్లొద్దన్నారు. హిరమండలం ఎస్సై జి.నారాయణస్వామి ఉన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



సరుబుజ్జిలి: రావివలసలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు



హిరమండలం: మామిడిజోలలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం



పాతపట్నం: ఎస్సీ వీధిలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు



కొత్తూరు: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వెలుగు సిబ్బంది

సరుబుజ్జిలి: ఓటు హక్కు విలువ గురించి ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలని వెలుగు ఏపీఎం కమలకుమారి పాండ్యన్, సీసీ కూన రోజాలత తెలిపారు. మండలంలోని రావివలసలో ఓటు హక్కు వినియోగంపై బుధవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఓటు ప్రజాస్వామ్యంలో వజ్రాయుధమన్నారు. వెలుగు సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

మామిడిజోలలో..

హిరమండలం: ప్రతిఒక్కరూ ఓటు వేయాలని తహసీల్దార్ బి.సుదాకర్ అన్నారు. మండలంలోని మామిడిజోలలో ఓటు చైతన్య కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గత ఎన్నికల్లో గ్రామంలో తక్కువ ఓట్లు నమోదయ్యాయన్నారు. ఈ సారి ఆ పరిస్థితి ఉండకుండా అధికారులు గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏపీఎం ఎం.మనోరత్నం అన్నారు. పాతపట్నం ఎస్సీ వీధి, గాంధీ వీధిలో స్వీప్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై బుధవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. 18 ఏళ్లు నిండినవారు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. డ్వాక్రా మహిళలతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి, మానవహారం చేసి ప్రతిజ్ఞ చేశారు. సీసీఎస్‌లు ఎ.అప్పలస్వామి, డి.శ్రీధర్, రాజేశ్వరి, కామేశ్వరీ, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధమని వెలుగు ఏపీడీ సన్యాసినాయుడు అన్నారు. ఓటు హక్కును వినియోగంపై బుధవారం కొత్తూరులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం స్వీప్ కార్యక్రమం పేరుతో నిర్వహిస్తున్న నీ ఓటు–నీ భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏసీ మనోరత్నం, ఏపీఎం జనార్దనావు, ఏపీఎంలు సుబ్బయ్య నాయుడు, పార్వతమ్మ, ఎం.సుశీల, టి.త్రినాథమ్మ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం



సరుబుజ్జిలి: బూర్జ మండలం అల్లెనలో ప్రచారం నిర్వహిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



సారవకోట: అద్దపనసలో ఎన్నికల ప్రచార కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



పాతపట్నం: యశోధనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ఎన్నికల ప్రచారంలో స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి

సంక్షేమరాజ్య నిర్మాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయానికి అందరూ బాసటగా నిలవాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, నరసన్నపేట, పాతపట్నం ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి కోరారు. బూర్జ మండలం అల్లెన గ్రామ పంచాయతీలో బుధవారం సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని స్పీకర్ నిర్వహించారు. ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థిగా పేడార తిలక్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సారవకోట మండలంలోని అంగూరు, అద్దపనస, వెంకటాపురం, శివరాంపురం, సవరశివరాంపురం గ్రామాల్లో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని విద్యానగర్, సంపంగినగర్, యశోధనగర్‌లో ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. మెళియాపుట్టి మండలంలోని మారడికోట సచివాలయం పరిధిలోని సవరచీడి పాలెం, చీడిపాలెం, మారడికోట గ్రామాల్లో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జలుమూరు మండలంలోని అంధవరం పంచాయతీ పరిధి రామకృష్ణాపురం, గొల్లపేట, ఉప్పరపేట గ్రామాల్లో పార్టీ బీసీ జోనల్ ఇన్‌చార్జ్, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య ఎన్నికల ప్రచారం చేపట్టారు. హిరమండలం మండలంలోని ధనుపురంలో గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి తనయుడు రెడ్డి శ్రావణ్ నిర్వహించారు. కొత్తూరు మండల కేంద్రంలోని బీసీ కాలనీ, రెల్లివీధి, రాజావీధి, కాలేజీ రోడ్డుతో పాటు పలు వీధుల్లో ఎమ్మెల్యే రెడ్డి శాంతి తనయుడు, యువ నాయకుడు రెడ్డి ఓం శ్రీకృష్ణ ప్రచారం చేపట్టారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి 18వ వార్డులో గల బొడ్డేపల్లిపేట, కొత్తవీధి తదితర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



జలుమూరు: అంధవరంలో ప్రచారం నిర్వహిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య



హిరమండలం: ధనుపురంలో ప్రచారం చేస్తున్న రెడ్డి శ్రావణ్, నాయకులు



కొత్తూరు: బీసీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రెడ్డి ఓం శ్రీకృష్ణ



ఆమదాలవలస: బొడ్డేపల్లిపేటలో ప్రచారం చేస్తున్న తమ్మినేని చిరంజీవినాగ్

ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న ఏపీడీ రాధ

హిరమండలం: ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రజలకు ఉపయోగపడే పనులకు పెద్దపీట వేయాలని ఏపీడీ రాధా అన్నారు. హిరమండలం వెలుగు కార్యాలయం సమావేశ మందిరంలో ఉపాధి హామీ పథకం పనులపై బుధవారం సమీక్షించారు. కొత్తూరు, హిరమండలం ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.22 కోట్లతో పనులు చేపట్టాలని ఆదేశించారు. వేతనదారులకు 4,77,000 పని దినాలు కల్పించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వేసవి దృష్ట్యా పని ప్రదేశాల్లో అన్నిరకాల వసతులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తాగునీరు, నీడ సదుపాయం తప్పనిసరిగా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెండు మండలాల ఏపీఓలు పాల్గొన్నారు.